క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో భావనరుషిస్వామి కల్యాణం

పెడన: పట్టణంలో కొలుకలవారి వీధిలోని భద్రావతీ సమేత శ్రీభావనరుషిస్వామి ఆలయంలో సోమవారం ఏకాదశ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని భక్తిశ్రద్ధలతో కల్యాణం చేశారు. సనం వెంకటసత్యనారాయణ, కరుణ కుమారి దంపతులతో పండితులు అయిలూరి జైకిషోర్ కల్యాణ క్రతువును నిర్వహించారు. తొలుత ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం జరిగిన భారీ సమారాధనలో వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి వారి అన్న ప్రసాదాలను స్వీకరించారు. ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

జగనన్న కాలనీలో సమస్యల పరిష్కారానికి అర్జీ



బంటుమిల్లి: స్థానికంగా గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలో మౌలిక సౌకర్యాలు కల్పించాలంటూ కాలనీవాసులు సోమవారం ఇన్‌చార్జి ఎంపీడీఓ నీరజాక్షికి వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం జగనన్న కాలనీలో మండల పరిధిలోని 5 గ్రామాలకు చెందిన దాదాపు 630 మంది లబ్ధిదారులకు పట్టాలు మంజూరు చేసింది. గత ప్రభుత్వంలోనే కాలనీ స్థలాలు మెరక చేసి విద్యుత్ స్తంభాల ఏర్పాటు చేశారు. విద్యుత్ స్తంభాలకు వీధి దీపాలు, కాలనీలో అంతర్గత రోడ్లు నిర్మించాలని, తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ కాలనీవాసులు సీపీఎం ఆధ్వర్యంలో ఎంపీడీఓకు ఇచ్చిన వినతిపత్రంలో విజ్ఞప్తి చేశారు. కాలనీలో మౌలిక సౌకర్యాలు లేక రాత్రి వేళ విష పురుగులతో ఇబ్బందులు పడుతున్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు జి. నాగేశ్వరరావు, ఎల్. అజయ్‌ఘోష్ కాలనీవాసులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేదపండిత సభలు

మచిలీపట్నంటౌన్: నగరంలో బలరాముని పేటలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం(యతిరాజ భవనం)లో సోమవారం రెండో రోజు కూడా వేద పండిత సభలు జరిగాయి. నరసాపురానికి చెందిన వెంకటాచార్యస్వామి అధ్యక్షతన సభలు జరిగాయి. తిరుపతికి చెందిన రంగ రామానుజం ధాటీ పంచకం, కేశ నరసింహస్వామి చరమ శ్లోకంతో ధర్మత్యాగాన్ని వివరించారు. వరాహలక్ష్మీ నరసింహ స్వామి, శ్రీమన్నారాయణ సులభ సాన్నిధ్య కైంకర్యం తదితర అంశాలపై ఉపన్యసించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యదర్శి దోర్డ్ల హేమప్రకాష్, బాలనాగసుందరీదేవి దంపతులను ఆలయ పోగ్రామ్స్ కమిటీ సభ్యురాలు చక్కా హిమవతి సువర్చలాదేవి సత్కరించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు కంతేటి శ్రీనివాస గుప్తా, కోశాధికారి మాజేటి మోహనమురళి పర్యవేక్షించారు.

దేశానికి ఆదర్శంగా.. స్వచ్ఛ సుందర చల్లపల్లి

చల్లపల్లి: దేశానికి ఆదర్శంగా నిలుస్తున్న స్వచ్ఛ సుందర చల్లపల్లిని, స్వచ్ఛ కార్యకర్తలను చూస్తుంటే గర్వంగా ఉందని పారిశ్రామికవేత్త విక్కుర్తి వెంకట శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఉదయం ఆయన స్వచ్ఛ కార్యకర్తలతో కలిసి 216 జాతీయ రహదారిపై కాసానగరం వద్ద స్వచ్ఛ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. దారికి రెండువైపులా ఉన్న ముళ్ల కంపలను, చెత్తను తొలగించి శ్రమదానం చేశారు. విక్కుర్తి మాట్లాడుతూ పదేళ్ల క్రితం డాక్టర్ డీఆర్కే ప్రసాద్, పద్మావతి దంపతులతో ప్రారంభమైన స్వచ్ఛ చల్లపల్లి చలినీ, వర్షాలను లెక్కచేయక పదేళ్లపాటు ముందుకు నడిపించిన ఘనత వారికే దక్కుతుందని కొనియాడారు. స్వచ్ఛ కార్యకర్తలు, విక్కుర్తి రాంబాబు, న్యాయవాది వి.రామకృష్ణ, బర్మా శ్రీనివాసరావు, వేములపల్లి శ్రీహరి, ఎస్.పున్నయ్య చౌదరి, షేక్ బాజీ తదితరులు పాల్గొన్నారు.

వీఓఏల సమస్యలపై వినతి

కొడాలి(ఘంటసాల): ఏపీ వెలుగు పథకంలో పని చేస్తున్న వీఓఏల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ వెలుగు వీఓఏ (యానిమేటర్స్) ఉద్యోగుల సంఘం ప్రతినిధి కొల్లూరి నాని ఆధ్వర్యంలో వీఓఏలు మంత్రి నాదెండ్ల మనోహర్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఘంటసాల వీఓఏలు పాల్గొన్నారు.

గేట్లు పెట్టినా ఆగని ఉప్పునీరు

- అధికారుల నిర్లక్ష్యంతో యథావిధిగా చొచ్చుకువస్తున్న సముద్రం నీరు
- బెడ్ కాంక్రీట్ వేయకుండా గేట్లు బిగించడమే కారణం
- పాలకుల తీరుపై మండి పడుతున్న రైతులు



కోడూరు అవుట్‌ఫాల్ స్లూయిస్‌కు ఏర్పాటు చేసిన ఫైబర్ గేట్లు



గేట్ల కింద నుంచి పొలాల వైపునకు వస్తున్న సముద్రం ఉప్పునీరు

కోడూరు: సముద్రంలోని ఉప్పునీరు పంట పొలాల్లోకి చొచ్చుకు రాకుండా ఏర్పాటు చేసిన ఫైబర్ గేట్లు అధికారుల నిర్లక్ష్యంతో రైతులకు ఉపయోగం లేకుండా పోయాయి. కోడూరు, ఉల్లిపాలెం, దింటి మెరక, స్వతంత్రపురం పరిధిలోని సుమారు నాలుగు వేల ఎకరాలకు సంబంధించిన పంట పొలాల్లో మురుగు పోయేందుకు ఉల్లిపాలెం సమీపంలోని కృష్ణా కరకట్ట వద్ద ఉన్న కోడూరు అవుట్‌ఫాల్ స్లూయిస్ దోహదపడుతుంది. అయితే ఈ అవుట్‌ఫాల్ స్లూయిస్‌కు సంబంధించిన షట్టర్లు దెబ్బతినడంతో నది ద్వారా సముద్రంలోని ఉప్పునీరు తిరిగి డ్రైన్‌లోకి ప్రవహిస్తున్నాయి. ఉప్పునీటితో డ్రైన్ నిండిపోయి నీరు పైకి ఎగదన్నుతోంది. ఈ ప్రభావంతో సమీప పంట పొలాలు ముంపు బారిన పడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కృష్ణానదికి భారీ మొత్తంలో వరద నీటిని విడుదల చేసిన సమయంలో కూడా ఈ అవుట్‌ఫాల్ స్లూయిస్ ద్వారా వరద నీరు పొలాల్లోకి చేరుతుంది.

రూ.3లక్షలతో ఫైబర్ గేట్లు ఏర్పాట్లు

అవుట్‌ఫాల్ స్లూయిస్‌కు వెంటనే మరమ్మతులు చేయాలని రైతులు డిమాండ్ చేయడంతో ప్రభుత్వం స్లూయిస్ మరమ్మతులకు రూ.3లక్షల నిధులు కేటాయించింది. ఈ నిధులతో ఇరిగేషన్ అధికారులు స్లూయిస్‌కు ఉన్న పాత గేట్లను తొలగించి నూతనంగా ఫైబర్ గేట్లను అమర్చారు. రెండు రోజుల నుంచి ఈ పనులను అధికారులు చేస్తుండగా శుక్రవారం పూర్తయ్యాయి. అయితే రూ.3లక్షలు పెట్టి ఫైబర్ షట్టర్లు పెట్టినా రైతులకు ఏ మాత్రం ఉపయోగం లేకుండా పోయాయి. ఉప్పునీరు యథావిధిగా మళ్లీ పంట పొలాల్లోకి చేరుతోంది. షట్టర్లు ఏర్పాటు సమయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడమే ఇందుకు కారణమని రైతులు మండిపడుతున్నారు. షట్టర్ల కింద భాగంలో భారీ గుంతలు ఉండడంతో పాటు బెడ్ లెవల్ సరిగ్గా లేకపోవడంతో నీరు మళ్లీ పొలాల్లోకి వస్తోందని రైతులు ఆరోపిస్తున్నారు. షట్టర్లు బిగించే ముందు బెడ్ లెవల్ సరి చేసి కాంక్రీట్ పనులు చేయకపోవడంతో సమస్య పరిష్కారం కాలేదని వాపోతున్నారు. కింద భాగంలో కాంక్రీట్ వేసిన తర్వాతే గేట్లు బిగించాలని చెప్పినా కూడా వినిపించుకోకుండా పనులను మసిపూసి మారేడు కాయ చందంగా చేసి చేతులు దులుపుకొన్నారని రైతులు ఆరోపిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపంతో రూ.3లక్షల నిధులు వృథా అయ్యాయని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి ఉప్పునీరు పొలాల్లోకి రాకుండా అవసరమైన మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు.

ఫైబర్ గేట్లతో ఉపయోగం లేదు



కోడూరు అవుట్‌ఫాల్ స్లూయిస్ వద్ద రూ.3లక్షలు పెట్టి ఏర్పాటు చేసిన ఫైబర్ గేట్లు ఉపయోగం లేకుండా పోయాయి. అధికారులు గేట్లు పెట్టి చేతులు దులుపుకొన్నారే గాని అక్కడ బెడ్‌కు మరమ్మతులు చేయలేదు.

–మాలంపాటి రాంబాబు, రైతు, స్వతంత్రపురం

యథావిధిగా పొలాల్లోకి వస్తున్న ఉప్పునీరు



ఫైబర్ గేట్లు ఏర్పాటు చేసినా ఉప్పునీరు యథావిధిగా పొలాల్లోకి వస్తోంది. గేట్ల కింద ఉన్న గుంతలను కాంక్రీట్‌తో పూడ్చి మరమ్మతులు చేస్తే సమస్య పరిష్కారమయ్యేది. ఉన్నతాధికారులు స్పందించాలి.

–అన్నే బుచ్చిరాంబాబు, రైతు, కోడూరు

అధికారుల సహకారం లేదు

- మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి
- ఎక్కడి చెత్త అక్కడే..



మార్కెట్‌యార్డు వద్ద చెత్త నిల్వలను చూస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ నాగకుమారి, ప్రసాద్

పెడన: పట్టణంలో చెత్త నిల్వలు ఎక్కడ పడితే అక్కడ ఉంటున్నాయని, అధికారులకు చెబుతున్నా స్పందించడం లేదని మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి, 8 వార్డు కౌన్సిలర్ కటకం ప్రసాద్ పేర్కొన్నారు. పట్టణంలో చెత్త నిల్వలపై ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చాయని, వాటిని అధికారులకు తెలియజేద్దామని ఫోన్ చేస్తుంటే తీయడం లేదని వారు తెలిపారు. సోమవారం ఉదయం పెడన వ్యవసాయ మార్కెట్ వద్ద చెత్త నిల్వలను చైర్‌పర్సన్ దంపతులు మీడియా ప్రతినిధులకు చూపించి ఆవేదన వ్యక్తం చేశారు. పదే పదే ఫోన్లు చేస్తున్నా కింది స్థాయి సిబ్బంది కూడా అలాగే అంటున్నారు తప్ప చెత్త నిల్వలను తీయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డులో చెత్త రోడ్డుపైకి చేరుతోందని, సిబ్బందిని హెచ్చరించినా పట్టించుకోవడం లేని ఆవేదన వ్యక్తం చేశారు. కౌన్సిల్ సమావేశంలో హెచ్చరించామని, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామని, వారు కూడా స్పందించడం లేదని తెలిపారు. పురప్రజలు అధికారుల చర్యలను గమనించాలని వారు కోరారు.

పులకించిన జరుగువానిపాలెం

కనులపండువగా పంచముఖ ఆంజనేయుడి విగ్రహ ప్రతిష్ఠ



ఆలయంలో పంచముఖ ఆంజనేయుడిని ప్రతిష్ఠిస్తున్న గ్రామపెద్దలు, పండితులు

కోడూరు: వేదపండితుల మంత్రోచ్ఛరణలు.. మంగళవాయిద్యాల మధుర స్వరాలు.. పూల మరిమళాలు.. బాణసంచా వెలుగులు.. జై శ్రీరామ్.. జై హనుమాన్ అంటూ భక్తిపారవశ్యంతో భక్తులు చేసే నినాదాల నడుమ పంచముఖ ఆంజనేయుడి విగ్రహ ప్రతిష్ఠ అత్యంత వైభవోపేతంగా జరిగింది. మండలంలోని జరుగువానిపాలెం గ్రామంలో నిర్మించిన దేవాలయంలో సోమవారం ఉదయం పంచముఖ ఆంజనేయ స్వామి 10 అడుగుల ఏకశిలా విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. సుమారు రూ.30లక్షల వ్యయ అంచనాతో రెండు అంతస్తుల్లో నిర్మించిన ఆలయంలో ఉదయం 8.09 గంటలకు గణపతి, దక్షిణామూర్తి విగ్రహాలను ముందుగా ప్రతిష్ఠించారు. అనంతరం అశేష భక్తజనం జైజై నినాదాల నడుమ ఆంజనేయుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఆలయ ముందు భాగంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠను కూడా కనులపండువగా చేశారు.

కనులపండువగా కల్యాణం

పంచముఖ ఆంజనేయుడి పంచలోహ విగ్రహానికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. గ్రామానికి చెందిన 15మంది దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించి సీతారామచంద్ర స్వామివార్లు, సువర్చల సమేత ఆంజనేయస్వామివారి శాంతి కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు. అనంతరం మహాపూర్ణాహుతిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మధ్యాహ్నం సుమారు 8 వేల భక్తులు అన్నదానంలో పాల్గొన్నారు.

రేషన్ కష్టాలు..



పాపవినాశనంలో రేషన్ తీసుకోవడానికి నడిచి వెళ్తున్న వృద్ధురాలు కొలుసు నాగమ్మ

పాపవినాశనం(ఘంటసాల): ఎర్రటి ఎండలో చేతిలో సంచి తీసుకుని నడుచుకుంటూ వెళ్లున్న ఓ వృద్ధురాలిని అవ్వా ఎక్కడకు వెళ్తున్నావు అంటూ పలకరించగా బియ్యం తెచ్చుకోవడానికి వెళ్తతున్నానయ్యా అంటూ చెప్తూ తన ఆవేదన తెలిపింది. సేకరించిన వివరాల మేరకు ఘంటసాల మండలం పాపవినాశనం శివారు గొల్లపాలెంకు చెందిన వృద్ధురాలు కొలుసు నాగమ్మ సోమవారం మధ్యాహ్నం రేషన్ బియ్యం తెచ్చుకోవడానికి గొల్లపాలెం నుంచి సుమారు కిలోమీటరు పైగా దూరంలో ఉన్న పాపవినాశనంలోని రేషన్ షాపునకు బియ్యం తెచ్చుకోవడానికి వెళ్తోంది. మార్గమధ్యలో ఓ వ్యక్తి అవ్వ ఎక్కడకు వెళ్తున్నారు అనగా అయ్యా రేషన్ బియ్యం తెచ్చుకోవడానికి వెళ్తతున్నాని చెప్పడంతో పాటు గతంలో ఇంటి వద్దకు బియ్యం వచ్చేవి ఇప్పుడు వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేసింది. రేషన్ వాహనాలు తీసివేయడంతో ప్రజలకు రేషన్ కష్టాలు తప్పడం లేదంటూ పలువురు విమర్శిస్తున్నారు.

దేవదాయ శాఖ కార్యనిర్వహణ అధికారిపై బదిలీ వేటు

గూడూరు: గూడూరు మండలంలోని దేవదాయ శాఖ కార్యనిర్వహణ అధికారి తిక్కిశెట్టి వీర వెంకట రామ్మోహనరావుపై ప్రభుత్వం బదిలీవేటు వేసింది. మండల పరిధిలోని 18 ఆలయాలకు రామ్మోహనరావు కార్యనిర్వహణ అధికారిగా వ్యవహరిస్తున్నారు. ఆయన పరిధిలో గూడూరు, కంకటావ, తరకటూరు, ముక్కొల్లు, ఆకులమన్నాడు, కంచాకోడూరు తదితర గ్రామాల ఆలయాలు ఉన్నాయి. కొద్ది రోజుల క్రితం కంకటావలోని శ్రీవేణుగోపాల వెంకటాచలస్వామి ఆలయ భూమిలో కొంత మంది మట్టిని అక్రమంగా తవ్వి అమ్ముకున్నారు. గూడూరులోని అంకమ్మ పేరంటాలు దేవస్థానం భూమిలో మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు అందినా పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఆయనపై బదిలీ వేటు వేసినట్లు తెలుస్తోంది. ఆయన స్థానంలో మచిలీపట్నం బచ్చుపేట వెంకటేశ్వరస్వామి ఆలయ కార్యనిర్వహణ అధికారిగా పనిచేస్తున్న సమ్మెట ఆంజనేయ స్వామిని నియమించింది.

నేడు వివేకానంద డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా

చల్లపల్లి: స్థానిక వివేకానంద డిగ్రీ కళాశాలలో మంగళవారం మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల కరెస్పాండెంట్ యార్లగడ్డ శివరామప్రసాద్, ప్రిన్సిపాల్ పెమ్మసాని రమేష్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ జరిగే మేళాలో 10 కంపెనీలకు చెందిన బహుళ జాతీయ సంస్థల ప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, బి.టెక్, ఫార్మా చదివిన యువతీ యువకులు పాల్గొనవచ్చని వివరించారు. అభ్యర్థులు బయోడేటా, సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, పాస్‌పోర్టు ఫొటోలతో హాజరుకావాలని తెలిపారు. చల్లపల్లి చుట్టుపక్కల ప్రాంతాల యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అవనిగడ్డలో లాడ్జీల ఆకస్మిక తనిఖీలు

అవనిగడ్డ: అవనిగడ్డలోని పలు లాడ్జీలను ఎస్‌ఐ శ్రీనివాస్ ఆకస్మిక తనిఖీలు చేశారు. పోలీస్‌శాఖ ఉన్నతాధికారుల అదేశాల మేరకు ఎస్‌ఐ పోలీసు సిబ్బందితో కలసి లాడ్జీలను తనిఖీ చేశారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించినా, అనుమానాస్పద వ్యక్తులు వచ్చినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన లాడ్జి నిర్వాహకులకు సూచించారు.

‘వెన్నుపోటు దినం’ విజయవంతం చేయండి



బందరులో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నగర ఉపాధ్యక్షుడు వరప్రసాద్



వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మండల పార్టీ నాయకులు

వైఎస్సార్ సీపీ శ్రేణులకు పిలుపు

మచిలీపట్నంటౌన్: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తయినా ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడాన్ని నిరసిస్తూ ఈ నెల 4న పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని కార్యకర్తలు విజయవంతం చేయాలని ఆ పార్టీ నగర ఉపాధ్యక్షులు పిలుపునిచ్చారు. నగరంలోని పలు డివిజన్లలో పార్టీ నగర ఉపాధ్యక్షులు తిరుమలశెట్టి వరప్రసాద్, గూడవల్లి నాగరాజు సోమవారం కార్యకర్తల సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడాది కాలంలో పాలకులు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుండా ప్రజలను వంచనకు గురి చేశారన్నారు. పాలకుల తీరును నిరసిస్తూ 4వ తేదీ ఉదయం 9 గంటలకు నగరంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య(నాని), పార్టీ నియోజకవర్గ కన్వీనర్ పేర్ని కృష్ణమూర్తి(కిట్టు) హాజరవుతారన్నారు. ఈ సందర్భంగా 31వ డివిజన్ కార్పొరేటర్ యండ్రపాటి నాగేశ్వరరావు జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి, ఆయన్ను పలువురు నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా కోశాధికారి బందెల థామస్‌నోబుల్, రాష్ట్ర క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ జక్కుల ఆనంద బాబు(జానీ), మాజీ పీపీ కొక్కిలిగడ్డ శరత్‌కుమార్, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, పార్టీ ఇన్‌చార్జ్‌లు, నాయకులు, కర్యకర్తలు పాల్గొన్నారు.

కోనేరుసెంటర్: కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్నా ప్రజలకు ప్రయోజనం కలగకపోగా తీరని అన్యాయం జరిగిందని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి గణేషన రమేష్ మండిపడ్డారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 4న నిర్వహించనున్న వెన్నుపోటు దినం వాల్‌పోస్టర్‌ను సోమవారం నగరంలోని పార్టీ కార్యాలయంలో వెస్ట్ మండల పార్టీ నాయకులు ఆవిష్కరించారు. రమేష్ మాట్లాడుతూ నిరసన దినంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలన్నారు. వెస్ట్ మండల అధ్యక్షుడు జన్ను రాఘవ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలంతా దగాకు గురయ్యారన్నారు. జిల్లా కోర్టు సెంటర్‌లోని పార్టీ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు శాంతియుత ర్యాలీ నిర్వహించి ప్రజల పక్షాన జిల్లా అధ్యక్షుడు పేర్ని నాని ఆధ్వర్యంలో పేర్ని కిట్టుతో కలిసి నిరసన తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అర్చకుడిపై దాడికి యత్నం!

పెడన: పట్టణంలోని తోటమూల సెంటర్లో ఉన్న శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయ అర్చకుడు పృథ్వీ నాగరాజుపై జి.సాయి అనే యువకుడు అనుచరులతో దాడికి యత్నించాడని అర్చకుడు, హిందూ చైతన్య వేదిక జిల్లా అధ్యక్షుడు నాదెండ్ల కోటేశ్వరరావు, కమిటీ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. హనుమజ్జయంతి వేడుకల్లో భాగంగా ఆలయం వద్ద మే 29న ప్రత్యేక హోమాలు, పూజలు చేసి భారీ అన్న సమారాధన చేశామని, 31న అర్ధరాత్రి సాయి అనే యువకుడు పూటుగా మద్యం సేవించి ఎన్టీఆర్ కాలనీలో నివసిస్తున్న నా ఇంటి మీద దాడికి ప్రయత్నించాడని అర్చకుడు తెలిపారు. ఇంటిపై, తలుపులపై రాళ్లు పడ్డాయని, అసభ్య పదజాలంతో తనను, నా భార్యను, నా తల్లిని, కూతురిని దూషించాడని పేర్కొంటూ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశామన్నారు. ఈ నెల 1న ఉదయం ఆలయం వద్దకు వచ్చి సాయంత్రం లోపు మీరు కేసు వాపసు తీసుకోకపోతే మీ సంగతి చూస్తానని బెదిరించారని ఆలయ కమిటీ సభ్యులు, అర్చకుడు తెలిపారు. అదే రోజు సాయంత్రం 6 గంటల సమయంలో ఒక ఆవు దూడను తీసుకొచ్చి ఆలయానికి అడ్డంగా కట్టేయడంతో ఆలయంలో ధూపదీప నైవేద్యాలు స్వామి వారి దర్శించుకోవడానికి వచ్చిన మహిళలు భక్తులు తిరిగి వెళ్లిపోయారని, దీనిపై పోలీస్‌లకు సమాచారం ఇచ్చామన్నారు. ఈ విషయమై ఎటువంటి కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే

మచిలీపట్నంటౌన్: నగరంలో ఈ నెల 3వ తేదీ మంగళవారం కరెంట్ లైన్ల నిర్వహణ దృష్ట్యా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఈఈ ఎ.గోవిందరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 6 నుంచి 8 గంటల వరకు నగరంలోని బలరాముని పేట, నిజాంపేట, ఈడేపల్లి శక్తి గుడి ఏరియా, జిల్లా కోర్టు వెనుక ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు.

లబ్ధిదారుల భూములకు హద్దులు చూపండి



మీ కోసంలో ఆర్డీవో కె.స్వాతికి సమస్యను వివరిస్తున్న గడిదేసి అనూషరాజు

చిలకలపూడి(మచిలీపట్నం): పెదపట్నం గ్రామంలో ప్రభుత్వం పంపిణీ చేసిన భూములకు సర్వే చేయించి లబ్ధిదారులకు హద్దులు కేటాయించాలని సర్పంచ్ గడిదేసి అనూష కోరారు. సోమవారం మీ కోసం కార్యక్రమంలో అర్జీ ఇచ్చారు. 2008లో ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం పంచాయతీలో నిరుపేద రైతులకు సాగు చేసుకుని జీవనోపాధి పొందేందుకు పంచాయతీలో ఖాళీగా ఉన్న భూమిని సర్వే చేయించి 137 మందికి 66.97 ఎకరాల భూమిని సామాజిక వర్గాల వారీగా నిరుపేదలకు పంపిణీ చేశారని అర్జీలో పేర్కొన్నారు. గ్రామంలో భూ పంపిణీ ద్వారా పట్టాలు పంపిణీ చేసిన భూముల్లో తుమ్మచెట్లు ఏపుగా పెరిగాయని వాటిని తొలగింపునకు చర్యలు తీసుకోవాలన్నారు. స్తంభాలు తీగలు పాతవి కావడంతో తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోందన్నారు. వీటిని ఏర్పాటు చేయాలని కోరారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర యూత్ సెల్ సెక్రటరీగా నరేంద్ర



నాగాయలంక: గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ బీసీ నాయకుడు ఒడుగు నరేంద్రను ఆ పార్టీ రాష్ట్ర యూత్ విభాగం కార్యదర్శిగా తాడేపల్లిలోని కేంద్ర కార్యాలయం నియమించింది. ఈసందర్భంగా సోమవారం నరేంద్ర మాట్లాడుతూ తనను రాష్ట్ర స్థాయిలో గుర్తించేలా అవకాశం కలిగించిన అధినేత జగన్‌మోహన్ రెడ్డి, కృషి చేసిన అవనిగడ్డ నియోజకవర్గం ఇన్‌చార్జి సింహాద్రి రమేష్‌బాబు, సింహాద్రి వికాస్, నియోజకవర్గం పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను శక్తి మేరకు న్యాయం చేసేలా సేవలు అందిస్తానన్నారు.

ఘనంగా అంకమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ

గూడూరు: లేళ్లగరువు పంచాయతీ శివారు యాదవ లేళ్లగరువులో మాడుగుల అంకమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ సోమవారం ఘనంగా నిర్వహించారు. శ్రీకుంభం వారి ఇలవేల్పు అయిన మాడుగుల అంకమ్మ తల్లి ఆలయాన్ని గ్రామంలో నిర్మించారు. సోమవారం జరిగిన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ కుంభం శ్రీనివాసరావు, నాగబాబుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పరామర్శ



పెదకళ్లేపల్లి(మోపిదేవి): పెదకళ్లేపల్లి మాజీ సర్పంచ్ అరజా వెంకట సుబ్బారావును అవనిగడ్డ మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు సోమవారం పరామర్శించారు. ఇటీవల గుండెపోటుకు గురైన సుబ్బారావు హాస్పటల్‌లో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న సింహాద్రి వారి ఇంటివద్ద సుబ్బారావును పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట నేతలు కొండేటి రమేష్, తోట పిచ్చయ్య, గండు దుర్గారావు, కె. ఆది, స్థానిక నాయకులు ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులున్నా రైతుల మేలుకు కృషి



ఘంటసాల ఏఎంసీ పాలకవర్గ సభ్యులను అభినందిస్తున్న మంత్రి మనోహర్, ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్

కొడాలి(ఘంటసాల): రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రైతులకు మేలు చేసేందుకు కృషి చేస్తున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ఘంటసాల మండలం కొడాలి మార్కెట్‌యార్డు ప్రాంగణంలో ఘంటసాల వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం సోమవారం నిర్వహించారు. ముందుగా చల్లపల్లి నుంచి కొడాలి వరకు ర్యాలీగా వచ్చిన పాలకవర్గ సభ్యులు, నేతలు మార్కెట్ యార్డు ప్రాంగణంలోని సభావేదికపై ఘంటసాల ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, వైస్ చైర్మన్‌గా అత్తలూరి గోపిచంద్, పాలకవర్గ సభ్యులతో మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కిషోర్, ఏఎంసీ కార్యదర్శి బందారు హేమ సుందరరావు ప్రమాణ స్వీకారం చేయించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, ఏపీ మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ సీహెచ్.పాపారావు తదితరులు పాల్గొన్నారు.